క్లుప్తంగా

వార్డు సచివాలయాల తనిఖీ



25వ వార్డు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్: స్థానిక 25, 26 వార్డుల సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో ఎంతమంది సిబ్బంది ఉన్నారు, విధులకు ఎంతమంది గైర్హాజరయ్యారు, ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారా లేదా, కాలయాపన చేస్తున్నారా అంటూ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం వార్డు సచివాలయాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు.

నిధులు మంజూరు చేయండి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలను నిర్మించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. శుక్రవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మంగళగిరిలో కలసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ కళాశాలను అద్దె భవనంలో నడుపుతున్నారని భవనాలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఆదోని అర్బన్: పట్టణంలోని కోట్ల కూడలి నుంచి మున్సిపల్ రోడ్డు వరకు రోడ్డుకు అడ్డంగా పెట్టిన వాహనాలను తీయించి, వాహనదారులకు ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. శుక్రవారం దుకాణాల ముందు విచ్చలవిడిగా వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, నిబంధనల ప్రకారంగా పార్కింగ్ స్థలంలోనే వాహనాలను నిలిపాలని సూచించారు. అలాగే రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

గోనెగండ్ల: ఇటీవల కర్నూలు జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గోనెగండ్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని లావణ్య ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు కళ్యాణి తెలిపారు. గోనెగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆ పాఠశాలకు వెళ్లి లావణ్యకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏఈ ప్రసన్న ఆంజినేయులు తెలిపారు. వైఎస్ఆర్ సర్కిల్, సోమప్ప సర్కిల్, శారదకమిటీ ఏరియా, మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

టిప్పర్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో ఇందిరానగర్ కాలనీకి చెందిన పద్మకుమారిని శుక్రవారం టిప్పర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల మేరకు..కాలనీకి చెందిన పద్మకుమారి, ఆమె కుమారుడు రవికుమార్ పొలం పనిపై పెద్దకడబూరు గ్రామానికి వెళ్లి తిరిగి బైకుపై ఆదోనికి వస్తుండగా ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో వెనక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన పద్మకుమారిని స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కేజీబీవీలో విద్యార్థులను పస్తులుంచి టర్మినేట్ అయిన ప్రిన్సిపాల్ కవితకు ఇచ్చిన పోస్టింగ్ రద్దు చేసి విధుల నుంచి తొలగించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్‌కుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి జాన్‌బాబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డికి వినతిపత్రం అందించారు. అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించి మళ్లీ అదే పాఠశాలలో కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

ఆదోని రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎల్‌పీవో నూర్జహాన్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారంతో శిక్షణ కార్యక్రమం ముగిసింది. పంచాయతీ కార్యదర్శులు షేక్‌అహ్మద్, గోవిందప్ప, శశికళ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.





నందవరం: గురజాల నది తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, నది తీరంలో సైకత లింగానికి మహిళల పూజలు



మంగరాయ సన్నిధిలో దీపాలను వెలిగిస్తున్న బ్రాహ్మణులు



రణమండల ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపాలను వెలిగిస్తున్న దృశ్యం

దేదీప్యమానం..కార్తీక దీపోత్సవం

- రణమండల కొండకు ఇరువైపులా దీపాలను వెలిగించిన భక్తులు



దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న డీసీ

ఆదోని అర్బన్: కార్తీకమాస పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పట్టణ శివారులోని కొండలో వెలిసిన శ్రీ రణమండల కొండలో కార్తీక దీపోత్సవం దేదీప్యమానంగా జరిగింది. కార్తీక మాస నిత్య ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో కొండకు ఇరువైపులా భక్తులు దీపాలను వెలిగించారు. కొండ ప్రాంతమంతా జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజామున 4:30 గంటలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీ రణమండల ఆంజనేయస్వామి వారికి పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి తదితర పూజలు చేపట్టారు. సభ్యులు రామకృష్ణ, వెంకయ్యశెట్టి, సుబ్రహ్మణ్యంశెట్టి, అశోక్, లక్ష్మీనారాయణ, బోయ వీరేష్, విరూపాక్షి, బోయ వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే.. పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ సన్నిధిలో కార్తీకమాసం సందర్భంగా దీపోత్సవం జరిగింది.



కోసిగి: ప్రత్యేక అలంకరణలో బసవేశ్వరస్వామి

ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచారి ఆధ్వర్యంలో పూజారులు, బ్రాహ్మణులు, మహిళలు దీపాలను వెలిగించారు.

నందవరం: ప్రముఖ శైవ క్షేత్రం గురజాల రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఉదయం రామలింగేశ్వర స్వామి, పార్వతీ దేవికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, నమక చమక పూజలు గావించారు. అనంతరం భక్తులు తుంగ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి ఇసుక లింగాల ప్రతిమలను చేసుకుని విశిష్ట పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించి నదిలో వదిలారు. ఆలయ ప్రాంగణంలో ఉసిరి చెట్టు చుట్టూ దీపాలు వెలిగించి ప్రదక్షిణలు చేశారు. పురోహితులు తుంగభద్రమ్మకు ప్రత్యేక పూజలు చేసి తుంగ హారతి ఇచ్చారు. అనంతరం ఆదిదంపతులకు పల్లకోత్సవం నిర్వహించారు. జ్వాలతోరణం వెలిగించారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న రణమండల ఆంజనేయస్వామి

కోసిగి: మండలంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. బసవన్న కొండపై వెలసిన బసవేశ్వర, ఈశ్వర దేవాలయం, కందుకూరు రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దీపోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఉరుకుందలో లక్ష పుష్పార్చన

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో సందడిగా మారింది. శుక్రవారం కార్తీక పౌర్ణమితో పాటు దేవాలయం వద్ద లక్ష పుష్పార్చన, సహస్ర దీపోత్సవం ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకు మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం రుద్రాభిషేకం చేశారు. 10 గంటలకు లక్ష పుష్పార్చనతో జ్వాలాతోరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి సహస్ర దీపోత్సవం కనుల పండువగా జరిగింది. తుంగభద్ర దిగువ కాలువలో గంగ పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమీషనర్ విజయరాజు, అర్చకులు ఈరప్పస్వామి,మహదేవస్వామి,ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.



ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కోసిగి: సాయిబాబా ఆలయ ఆవరణంలో...

పుస్తక పఠనంతో మేధోశక్తి



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పెద్దకడబూరు: పుస్తక పఠనంతో మేధోశక్తి పెరుగుతుందని లైబ్రేరియన్ ఆశాజ్యోతి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రతి రోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలన్నారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదోని అర్బన్: గ్రంథాలయాల్లో పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానం అలవడుతుందని హెచ్ఎం లక్ష్మీనారాయణ, గ్రంథాలయ అధికారిణి సుజాత అన్నారు. శుక్రవారం రెండోరోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. నారాయణపురం ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం లక్ష్మినారాయణ, వివేకానంద పాఠశాల ఉపాధ్యాయులు సోఫియాఅఫ్రీన్, హనుమంతు, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు శారమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తక స్థానంలో సెల్‌ఫోన్ హస్తభూషణం అయ్యిందన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనతో పాటు పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తక పఠనంతో ఉపయోగాలను అధ్యాపకుడు హరికుమార్, గ్రంథాలయాధికారి హరికృష్ణ విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలతో వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు.

అందరి భాగస్వామ్యంతోనే పంచాయతీల అభివృద్ధి

గోనెగండ్ల: పంచాయతీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ మణి మంజరి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండల అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, డిజిటల్ అసిస్టెంట్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మణి మంజరి, ఈఓఆర్డీ అనంతసేన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం ఏయే పనులు చేయాలి? నిధులను ఎక్కడి నుంచి తీసుకురావాలి అనే విషయాలను వివరించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా పంచాయతీలో ప్రతి నెలా అధికారులు, సర్పంచ్, వార్డు సభ్యులు తప్పనిసరిగా సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి, పీఆర్ ఏఈ శివ శంకర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

నందవరం: అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీఓ పుల్లయ్య, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2025–26లో చేపట్టే అభివృద్ధి ప్రణాళికాలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమన్వయంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, వీధి దీపాలు, తాగునీరు, మురుగు కాలువల్లో పూడిక తీత, ఉపాధి పనులు వంటి వాటిపై ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ మణి మంజరి

25 నుంచి సమ్మె బాటలో 108 ఉద్యోగులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు



తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు

ఎమ్మిగనూరురరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు 108 ఉద్యోగులు శ్రీనివాసులు, కైలాష్, ఎగ్బాల్‌బాషా, ఎంకప్ప పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓలకు 108 ఉద్యోగులు సమ్మె నోటీసులను అందజేశారు. 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థలు మార్పు చేసే ప్రతిసారి ఈఎస్‌టీ, పైలెట్ల గ్రాట్యూటీ, ఎర్నడ్ లీవ్ అమౌంట్, వార్షిక ఇంక్రిమెంట్‌లు వంటివి చెల్లించకుండానే సంస్థలు వైదొలగడంతో తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. 108 ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే 108 సర్వీస్‌ను నిర్వహించాలని కోరారు.

గోనెగండ్ల: 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని ఉద్యోగులు వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 108 ఉద్యోగులు తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా 108 నిర్వహణ సంస్థలు మారుతున్నాయని, దీంతో 108 ఉద్యోగులకు రావాల్సిన అర్జిత సెలవులు, గ్రాట్యుటీ, పెండింగ్ బిల్లులు చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారని వాపోయారు. నవంబర్ 24 లోపు సమస్యలు పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.

సమస్యలు పట్టించుకోకపోతే పతనం తప్పదు

గోనెగండ్ల: ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ ఆనంద్ బాబు హెచ్చరించారు. శుక్రవారం గోనెగండ్ల బస్టాండ్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడమే గాక ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారం మోపడం సరికాదన్నారు.

హామీలను అమలు చేయాలి

నందవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గుణశేఖర్ డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందజేశారు.

మందు పిచికారీ.. రైతుకు అస్వస్థత

కోసిగి: పొలానికి మందు పిచికారీ చేస్తున్న రైతు అస్వస్థతకు గురైన ఘటన శుక్రవారం మండలంలోని కరణి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భీమేష్ తన పొలంలో మిరప పంట సాగుచేస్తున్నాడు. పంటకు మందు పిచికారీ చేస్తుండగా ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతన్ని హుటాహుటిన కోసిగి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో ఆదోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

లోకాయుక్త తరలింపు తగదు

ఎమ్మిగనూరుటౌన్: రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలులో హైకోర్ట్ ఏర్పాటు చేయకుండా శ్రీబాగ్ ఒప్పందాన్ని తుంగలో తొక్కి లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్‌ను సైతం కూటమి ప్రభుత్వం అమరావతికి తరలించే యోచన చేయడం శోచనీయమని ఆర్‌పీవీఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఖాజ, కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని విధాలుగా వెనుకబడ్డ కర్నూలు జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాల్సిన ప్రభుత్వం ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో ఏర్పాటు చేసిన కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎంఎస్ఈ టెక్నాలజీ కేంద్రాన్ని సైతం అమరావతికి తరలించే నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. రాయలసీమలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించి ఆయా సంస్థల తరలింపును అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంఘం నాయకులు మోహన్, రమణ, వెంకట్రాముడు, రామాంజి పాల్గొన్నారు.

సాయిబాబా మందిరం వార్షికోత్సవం



సాయి సత్యవ్రతాలు చేస్తున్న భక్తులు

కోసిగి: స్థానిక ఉరుకుంద రోడ్డులోని షిరిడీ సాయి బాబా మందిరం 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కాగడ హారతి, సుప్రభాతం, అభిషేకాలు, ఉచిత సాయి సామూహిక సత్యవ్రతాలు, విరాట్ సాయి స్తోత్రం, నిత్య ప్రార్థన పఠనం తదితర కార్యక్రమాలు జరిగాయి. అలాగే చందనోత్సవం, మధ్యాహ్న హారతి, బాబా చిత్ర పటానికి ఊరేగింపు నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం సంధ్యా హారతి, దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎల్లెల్సీలో పడి మహిళ మృతి



మృతి చెందిన రేణుక

ఎమ్మిగనూరురూరల్: పట్టణ సమీపంలోని ఎల్లెల్సీలో ప్రమాదవశాత్తూ కాలుజారి పడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు...తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన బాలరాజుకు వివాహమైనా రేణుక(26) అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ఎమ్మిగనూరుకు చేరుకున్నారు. ఆదోని రోడ్డులోని ఎల్లెల్సీ వద్దకు ఆటోలో వెళ్లి కాలువ గట్టుపై కొంత దూరం నడుకుచుకుంటూ వెళ్లారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేక్రమంలో రేణుక సిమింట్ మెట్లపై కాలు జారి కాలువలో పడిపోయింది. బాలరాజు కేకలు వేయటంతో అక్కడ ఉన్నవారు కాలువలో దూకి రేణుకను బయటకు తీశారు. అయితే అప్పటికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. కాలువ పరిధి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వస్తుండటంతో కేసు వివరాలను టౌన్ పోలీసులకు అందచేసినట్లు హెడ్ కానిస్టేబుల్ బీరప్ప తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో ఉంచి బాలరాజును విచారిస్తున్నటుల పోలీసులు తెలిపారు.

నీటి తొట్టిలో పడి..

మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన మాల నాగలక్ష్మి(39) శుక్రవారం ప్రమాదశాత్తూ నీటి తొట్టిలో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మాల వెంకటస్వామి, ఉరుకుందమ్మ దంపతులు కూతురు నాగలక్ష్మి రోజు మాదిరిగా కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం చేసేందుకని పొలంలోనే ఏర్పాటు చేసుకున్న నీటి నిల్వ తొట్టి సిమెంట్ బెడ్డుపై కూర్చొని చేతులు శుభ్రం చేసుకుంటుండగా ప్రమాదవశాత్తూ అందులో పడిపోయంది. నాగలక్ష్మి ఎంతకూ రాకపోవడంతో తోటి కూలీలు నీటి తొట్టి వద్దకు వెళ్లి చూడగా అందులో విగతజీవిగా పడి ఉండటంతో బయటకు తీశారు. మహిళ మృతిపై రూరల్ పోలీసులను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు.

గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించాలి

కోసిగి: గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెండేకల్లు గ్రామంలో వచ్చిన అర్జీలను తహసీల్దార్ నిత్యానందరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోసిగి, పెండేకల్లు, పుట్టకుంట, కడదొడ్డి, మూగలదొడ్డి, ఆర్లబండ, కలువలగుండు, పల్లెపాడు, సజ్జలగుడ్డం, యండపల్లి, జంపాపురం, జుమ్మాలదిన్నె, వందగల్లు, అగసనూరు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి గ్రామ సభలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో 450 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే ఎండార్స్‌మెంట్ రాసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ, డివిజన్ సర్వేయర్ వేణుసూర్య, వీఆర్వో బసవరాజు పాల్గొన్నారు.



పెండేకల్లులో రీసర్వే కొలతలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తాం

పెద్దకడబూరు: సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని జిల్లా సహకార ఆడిట్ అధికారి శిరీష అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా చిన్నతుంబళం వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ ఆవరణంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. సహకార సంఘాలు బలోపేతం చేయడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. చిన్నతుంబళం సహకార సంఘం నుంచి ఈఏడాది రూ. 1.12 కోట్ల స్వల్ప కాలిక రుణాలు, రూ. 1.29 కోట్లు రైతు నేస్తం పథకం, రూ. 29.30 లక్షలు రాజన్న చేయూత పథకం కింద రుణాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాంప్లెక్స్ ఎరువులు కూడా అందించినట్లు వివరించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో సంఘానికి చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఆదోని సహకార కార్యాలయ అసిస్టెంట్ రిజిస్టార్ ఉమాదేవి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రామరాజు సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు